

3 నుంచి 'పది' గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి - టెక్కలి : పదో తరగతి విద్యార్థులకు మార్చి మూడో తేదీ నుంచి గ్రాండ్ టెస్ట్ పేరిట పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కాలనిర్ణయ పట్టికను విద్యాశాఖ విడుదల చేసింది. మూడో తేదీన ప్రారంభం కానున్న పరీక్షలు 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కొద్దిరోజుల విరామం అనంతరం మార్చి 17వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కొద్దిరోజుల కిందటే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించిన విద్యాశాఖ కొద్దిరోజుల విరామం అనంతరం మళ్లీ గ్రాండ్ టెస్ట్ పేరుతో పరీక్షలు నిర్వహించడంపై ఉపాధ్యాయులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు చేయాల్సిన ముఖ్య సూచనలు ఉండగా, మళ్లీ గ్రాండ్ టెస్ట్ పేరుతో పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 5,035 ఓటర్లు
- జిల్లావ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరుగనుంది. ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో బుధవారం పంపిణీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పిఒలు, ఎపిఒలు ఇతర సిబ్బంది బుధవారం సాయంత్రమే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ మొదలై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మొత్తం 5,035 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 3,416 మంది పురుషులు, 1,619 మంది మహిళలు ఉన్నారు. వీరు ఓటు వేసేందుకు జిల్లావ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో నిర్వహించనున్న ఎన్నికలకు 5,670 బ్యాలెట్ పత్రాలు, 62 బ్యాలెట్ పెట్టెలను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్‌లను ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి నుంచి ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు, తాగునీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 13 మంది నోడల్ అధికారులను నియమించారు. 31 మంది ప్రిసైడింగ్, 93 మంది పోలింగ్ అధికారులను నియమించారు. వీరితో పాటు పదేసి మంది చొప్పున రూట్, జోనల్ అధికారులను నియమించారు. 31 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. పోలింగ్ పర్యవేక్షణకు అన్ని కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు.


శ్రీకాకుళంలో అత్యధికం... లావేరులో అత్యల్పం

శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ రూమ్ నంబరు ఎనిమిది బూత్‌లో అత్యధిక మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 710 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అదే పోలింగ్ కేంద్రం రూమ్ నంబరు 17 బూత్‌లో 707 ఓటర్లు ఉన్నారు. లావేరు జెడ్‌పి హైస్కూల్ రూమ్ నంబరు రెండులో అత్యల్పంగా 44 మంది ఓటర్లే ఉన్నారు.

ఎన్నికల నేపథ్యంలో నిషేధాజ్ఞలు అమలు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిషేధ ఆంక్షలు జారీ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని పోలింగ్, పంపిణీ, స్వీకరణ, మధ్యంతర స్ట్రాంగ్ రూమ్ కేంద్రాల్లో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు. చట్టవ్యతిరేకంగా గుమిగూడడం, సభలు, ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిని పోలింగ్ సమయం ముగింపు వరకు నిషేధాజ్ఞలు వర్తిస్తుందని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీని బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అంతా హాజరయ్యారా అంటూ ఆర్‌డిఒ సాయిప్రత్యూషను అడగ్గా, ఇద్దరు ఆరోగ్య సమస్యలతో హాజరు కాలేదని బదులిచ్చారు. సరైన కారణాల్లేకుండా ఎన్నికల విధులకు ఎవరైనా హాజరు కాకపోతే ఎన్నికల నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ కౌంటర్ల వద్దే బ్యాలెట్ బాక్సులను అందజేయాలన్నారు. శ్రీకాకుళం నుంచి పోలింగ్ బాక్సులను విశాఖపట్నం తరలిస్తామని చెప్పారు. జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఆర్‌డిఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

250 మందితో పోలీస్ బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగించేందుకు 250 మంది సిబ్బందితో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గానూ నలుగురు డిఎస్‌పిల పర్యవేక్షణలో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సురక్షితంగా తరలించే విధంగా, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను సంబంధిత డిఎస్‌పిలు, సిఐలు పర్యవేక్షించాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు, మద్దతుదారులు ఎటువంటి టెంట్లు, స్టాల్స్ ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఓటర్ల స్లిప్పులపై రాజకీయ పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన ఎటువంటి గుర్తులు లేకుండా చూడాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ నేపథ్యంలో మద్యం అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో సెల్‌ఫోన్లు, వైర్‌లెస్ సెట్లు వినియోగించుకుండా చూడాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఎవరూ గుమిగూడి గుంపులుగా ఉండకూడదని సూచించారు.



పోలింగ్ మెటీరియల్‌తో కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

త్రిముఖ పోరు

- మండలి ఎన్నికలను 'కూటమి' రాజకీయం చేయడంపై ఉపాధ్యాయుల్లో ఆవేదన
- ప్రశ్నించే గళాన్ని గెలిపించుకునే ఆలోచనలో గురువులు
- పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిపై సానుకూలత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ నెలకొంది. మేధావుల సభకు మేధావులను పంపాల్సిన ఎన్నికలనూ రాష్ట్రంలోని 'కూటమి' పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం పూర్తిగా రాజకీయం చేసిందన్న భావన టీచర్లలో వ్యక్తమవుతోంది. తాజా ఎన్నికలకు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 34 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో గల 22,493 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని శాసన మండలి (పెద్దల సభ)కు తమ ప్రతినిధిని ఈ నెల 27న ఎన్నుకోనున్నారు. 13,508 మంది పురుష ఓటర్లు, 8985 మంది మహిళా టీచర్లు ఓటింగ్‌లో పాల్గొనున్నారు. వారు ఎవరిని గెలిపించనున్నారో మార్చి మూడో తేదీన స్పష్టం కానుంది.



ఎవరి నినాదాలేమిటి ?

'కూటమి' బలపరిచిన పాకలపాటి రఘువర్మ ఇంకోసారి గెలిపించాలని, బిజెపి మద్దతునిస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు తనను మూడోసారి మండలికి పంపాలని సాగిస్తున్న ప్రచారం ఉపాధ్యాయులను ఆకట్టుకోలేకపోయింది. రాజకీయ పార్టీల అండతో వారు సాగడం, పదవుల్లో ఉన్న కాలంలో వారు ఉపాధ్యాయవర్గానికి ఏమీ చేయకపోవడం అందుకు కారణంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఒక్క అవకాశం తనకిస్తే విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేస్తానని, ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో ప్రశ్నిస్తానని, వారి పోరాటాలకు అండగా ఉంటానని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి చేసిన ప్రచారం అందరినీ ఆకట్టుకుంది. ఆమె తన ప్రచారంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి గతంలో మండలిలో పిడిఎఫ్ సభ్యులు చేసిన కృషిని, తాను గెలిస్తే చేయబోయే పనిని ఉపాధ్యాయులకు తెలియజేశారు. యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా ఉన్న ఆమెకు సర్వత్రా సానుకూలత వ్యక్తమవుతోంది.

ముగ్గురి మధ్యనే పోటీ

ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, సిట్టింగ్ ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ, మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు మధ్య పోటీ నెలకొంది. ప్రభుత్వం పట్ల టీచర్లలో వ్యతిరేకత మొదలు కావడం, కూటమి పార్టీల్లో టిడిపి, జనసేన రఘువర్మకు మద్దతుగా ప్రచారానికి దిగడం ఉపాధ్యాయుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. శాసన మండలి ఎన్నికలను పూర్తిగా రాజకీయ ఎన్నికలుగా మార్చేసి రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ కేడర్‌ను, నాయకులను, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను రంగంలోకి తెలుగుదేశం, జనసేన దించడంతో టీచర్లలో ఒకరకంగా భయాందోళన నెలకొంది. ఇదంతా దేనికోసం?, విద్యారంగం భవిష్యత్ ఏమౌతుంది?, పాఠశాలల పరిస్థితి ఏమిటి?, విద్యారంగ రక్షణ కోసం ఉద్యమించిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఒక మహిళ అన్న విషయాన్ని కూడా చూడకుండా ప్రధాన పార్టీలు ఇలా పోటీకి తెగబడడం న్యాయమా? అనే చర్చ సర్వత్రా నెలకొంది.

ఎన్నికల హామీలు అమలు చేయలేకేనా ?

16,300 పైచిలుకు డిఎస్‌సి పోస్టులు గత నవంబరులోగా రాష్ట్రంలో తీస్తామని హామీనిచ్చి తొలి సంతకం కూడా చేసిన చంద్రబాబు ఇంతవరకూ ఆ చొరవ చేయలేదు. ఈ అంశంపై ప్రశ్నించి డిఎస్‌సి సాధించే వరకూ పోరాడే వారు మండలికెళ్తే ప్రమాదమన్నది అధికార పార్టీకి బాగా ఎరుకే. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడులో ఎవరు గెలిచినా కూటమికి వచ్చిన ఇబ్బందేమీ లేదు.

అదే సమయంలో ఈ ఇరువురిలో ఎవరు గెలిచినా ప్రమాదమే అన్న ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొంది. ముఖ్యంగా గత జగన్ ప్రభుత్వంలో టీచర్లను అవస్థలు పాల్జేసిన 'ఫేషియల్ అటెండెన్స్'ను చంద్రబాబు సర్కారు వెనక్కి తీసుకోలేకపోయిందంటూ మాస్టారులంతా మండిపడుతున్నారు. అధ్యాపకులు, టీచర్లలో మహిళల సంఖ్య ఎక్కువే. ఈ నేపథ్యంలో విజయగౌరిపై ఉపాధ్యాయుల్లో అపూర్వ స్పందన కనిపిస్తోంది.

శివాలయాలు కిటకిట

శ్రీముఖలింగం, రావివలసకు పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి - జలుమూరు, టెక్కలి రూరల్, శ్రీకాకుళం అర్బన్

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు సందర్శకులు పోటెత్తారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం, టెక్కలి మండలం రావిలవలసలోని ఎండల మల్లికార్జునస్వామి, శ్రీకాకుళంలోని కోటేశ్వరస్వామి ఆలయాలతో పాటు జిల్లాలోని పలు ఆలయాలకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. శ్రీముఖలింగం ఆలయానికి జిల్లా నలుమూలలతో పాటు ఒడిశా నుంచి సందర్శకులు దర్శనాలకు వచ్చారు. బుధవారం వేకువజామున రెండు గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఉచిత, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కుటుంబ సమేతంగా శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని దర్శించారు. విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఎస్‌పి కె.వి మహేశ్వరర రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. నాలుగేళ్లుగా ప్రసాదాల పంపిణీ నిలిచిపోగా, ఈ ఏడాది తిరిగి ప్రారంభించారు. దర్శనాల అనంతరం బయటకు వెళ్లే గేటు వద్ద సందర్శకులకు పంపిణీ చేశారు. సందర్శకులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం షామియానా టెంట్లు వేసినా, దర్శనానికి బారులు తీరడంతో అవి సరిపోలేదు. దీంతో ఎండలోనే నిల్చోవాల్సి వచ్చింది. కలెక్టర్, ఎస్‌పి ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు క్యూలైన్లలో ఉన్న సందర్శకుల వద్దకు వెళ్లి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. దర్శనాలకు చాలా సమయం పడుతోందని వారు చెప్పడంతో, త్వరితగతిన జరిగేలా చూడాలని కలెక్టర్ స్వయంగా ఆలయ అర్చకుల వద్దకు వెళ్లి చెప్పారు. క్యూలైన్లలో ఉన్న చిన్నారులు, సందర్శకులకు పాలు, బిస్కెట్లు, మంచినీంటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.



శ్రీముఖలింగం ఆలయం వద్ద బారులు తీరిన సందర్శకులు



టెక్కలి రూరల్ : ఎండల మల్లన్న ఆలయం వద్ద పోటెత్తిన సందర్శకులు

కిటకిటలాడిన రావివలస

ఎండల మల్లికార్జునస్వామి ఆలయం సందర్శకులతో కిటకిటలాడింది. బుధవారం వేకువజామున మూడు గంటల నుండే యాత్రికులు స్వామి దర్శనానికి బారులు తీరారు. టికెట్ల విక్రయ కౌంటర్లు, దర్శన క్యూలైన్లలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.గురునాథరావు, సిఐ అంబటి విజయకుమార్, ఎల్.ఎల్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీకాకుళం నగరంలోని నాగావళి నదీ పరివాహక ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయాన్ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సందర్శించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీసమేతంగా పలు ఆలయాలను సందర్శించారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

- 28న కలెక్టరేట్ వద్ద ధర్నా
- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు

ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఇవే డిమాండ్లతో ఈనెల 28న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ధర్నా పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలైనా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల గతంలో అనేక సమస్యలు చవిచూశామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అత్యవసర సేవల ద్వారా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, వారి హక్కులను రక్షించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. మున్సిపాల్టీలను పరిశుభ్రం చేసి, ప్రజల అవసరాలు తీర్చడమే గాక ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారంతో పాటు జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలని కోరారు. నగర పరిధిని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎ.గురుస్వామి, ఎ.మోహన్, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, సూపర్‌వైజర్ కె.సంతు తదితరులు పాల్గొన్నారు.

భార్యే నిందితురాలు

హడ్కో కాలనీ హత్య కేసును చేధించిన పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీలో ఈనెల 23వ తేదీన చోటుచేసుకున్న హత్య ఘటనను పోలీసులు చేధించారు. మృతుడు మజ్జి రమేష్ భార్య శశి హత్య చేసినట్లు విచారణలో తేలడంతో ఆమెను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీ టీ ఏజెంట్ వీధిలో నివాసముంటున్న మజ్జి రమేష్‌కు భార్య శశి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మజ్జి రమేష్ స్క్రాప్ షాపులో పనిచేస్తూ మద్యానికి అలవాటు పడి ఇంటికి డబ్బులు ఇవ్వకుండా భార్య, పిల్లలను హింసిస్తుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. మృతుడు ఇంటి తలుపులు తెరవకపోడంతో, అతని తల్లి మజ్జి విజయకు శశి ఫోన్ చేసి చెప్పారు. ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టడంతో పక్క ద్వారం నుంచి ఇద్దరూ వెళ్లి చూశారు. మృతుని మెడకు, ఎడమ వైపు గాయాలు ఉన్నాయి. భార్య శశి మాటల్లో తేడా ఉండడంతో మృతుని తల్లి విజయ ఈనెల 24వ తేదీన రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతి కేసును నమోదు చేసి విచారణ చేపట్టారు. ఘటనా స్థలం పరిశీలన, వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా శశిని విచారణ చేయడంతో ఆమె నేరం అంగీకరించినట్లు తెలిపారు. అనుమానాస్పద కేసును హత్యానేరం కేసుగా నమోదు చేసి మజ్జి శశిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసును చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించి, కొద్దిరోజుల్లో నిందితురాలిని అరెస్టు చేయడంతో ప్రతిభ కనబరిచిన రెండో పట్టణ సిఐ పి.ఈశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ శివాజీ, కానిస్టేబుల్ రమేష్‌ను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, డిఎస్‌పి వివేకానంద అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద

చక్రతీర్థ స్నానాలకు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - జలుమూరు

మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీముఖలింగేశ్వర స్వామి ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 28న నిర్వహించనున్న చక్రతీర్థ స్నానాలకు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. వంశధార నదిలో చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి చక్రతీర్థ స్నానాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. చక్రతీర్థ స్నానాలకు లక్షకు పైగా యాత్రికులు వచ్చే అవకాశముందని, అందుకనుగుణంగా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా స్వామివారి దర్శనం, చక్రతీర్థ స్నానాలు ఆచరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 950 మంది స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఉత్సవ విగ్రహాలు చక్రతీర్థ స్నానాలకు వెళ్లే మార్గం రెండు కిలోమీటర్ల మేరకు ఇరువైపులా బారికేడ్లు, పటిష్ఠ బందోబస్తుతో పాటు సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ప్రశాంతంగా ఉత్సవం నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్వామివారి దర్శనం నిమిత్తం వచ్చే యాత్రికులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, సిహెచ్.వివేకానంద్, ఇతర పోలీసు అధికారాలు, రెవెన్యూ, ఆలయ అధికారులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి


సంగిడి రాళ్లు ఎత్తుతున్న పోటీదారులు

కిష్టప్పేటలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కిష్టప్పేటలో పార్వతీసమేత కైలాశేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త గొండు జగన్నాధరావు దంపతులు, ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - నందిగాం

ఖరీఫ్ సీజన్‌లో పండిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పి.సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన నెల రోజులుగా పండిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అపరాల పంటలు వేసి పొలంలో వరికుప్పలు ఉంచి పంటలు తీసిన తర్వాత వరి కళ్లాల్లో నూర్పు చేసి రైతుసేవా కేంద్రాలకు వెళితే మిల్లర్లు షాకులు చెప్పి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు ఆరుగాలం కష్టించి పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో కనీస అవసరాలు తీర్చుకోలేక దళారులను ఆశ్రయిస్తున్నా రన్నారు. తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి


పలాస : ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్


నందిగాం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


ఆమదాలవలస : బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తున్న పోలింగ్ సిబ్బంది

ప్రజాశక్తి- టెక్కలి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల సిబ్బందికి సామగ్రీ అందించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని తొమ్మిది మండలాల ఎన్నికల అధికారులతో మాట్లాడారు. పక్షపాతం లేకుండా ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్నారు. మేధావులు ఓటర్లుగా పాల్గొంటున్న ఈ ఎన్నికల్లో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా, అయితే విధి నిర్వహణలో అప్రమత్తత అవసరమన్నారు. బ్యాలెట్ పేపర్ వినియోగంపై తప్పనిసరిగ్గా అవగాహన కల్పించాలన్నారు. మైక్రో పరిశీలకులు కూడా పోలింగ్ కేంద్రాల్లో ఉంటారని, వెబ్ కాస్టింగ్ తప్పనిసరిగ్గా ఉంటుందన్నారు. మండలాల్లో ఉన్న సిబ్బందికి ఎటువంటి సందేహాలున్నా సంబంధిత రెవెన్యూ అధికారులతో సంప్రదించాలన్నారు. చెల్లని ఓట్లు నమోదు కాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించిన వెంటనే సంబంధిత సామగ్రిని వెంటనే టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయానికి చేర్చాలన్నారు. అంతకు ముందు మండలాల వారీగా పంపిణీ చేసిన ఎన్నికల సామగ్రిని పర్యవేక్షించి నిర్వహణపై సిబ్బందిని ఆర్‌డిఒ అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డివిజన్‌లోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సారవకోట మండలాలకు చెందిన ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలించారు. డివిజన్‌లో 1053 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 780 మంది పురుషులు కాగా, 273 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

పలాస: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డివిజన్ పరిధిలో ఎనిమిది మండలాల్లో 1104 మంది ఓటర్లు ఉన్నారని వారిలో పురుష ఓటర్లు 798 కాగా, మహిళా ఓటర్లు 306 మంది ఉన్నారని ఆర్‌డిఒ జి.వెంకటేష్ తెలిపారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎనిమిది మండలాల్లో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి 40 మంది అధికారులను విధులకు నియమించడం జరిగిందని, అంతేకాకుండా రిలీఫ్ అధికారులుగా మరో 23 మందిని నియమించడం జరిగిందన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు

పోలాకి: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలని తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్ అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లును దగ్గరుండి పరిశీలించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో గుమిగూడి ఉండరాదని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడా లని సిబ్బందిని ఆదేశించారు. ఈ కేంద్రంలో 93 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. పర్యవేక్షణాధికారి శ్రీహరి, ఎస్ఐ దుర్గ్గా ప్రసాద్, పిఒ రామచంద్రరావు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కేంద్రాన్ని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, సెక్టార్ అధికారి శ్రీకాంత్ వర్మ, డిటి ఆర్.రామారావులు పరిశీలించారు. వసతులు, గాలి, వెలతురు ఉండే విధంగా చూడాలని సూచించారు.

లావేరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. లావేరు జెడ్‌పి పాఠశాలలో పోలింగ్ కేంద్రం 37లో 44 ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసు బలగాలు పోలింగ్ కేంద్రానికి విధులు నిర్వర్తించేందుకు చేరుకున్నారు. తహశీల్దార్ ఎన్ని జోగారావు, జెఆర్‌పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐ జి.లక్ష్మణరావులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎచ్చెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో కామర్స్ మేనేజ్‌మెంట్ బ్లాక్‌లో పోలింగ్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 170 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కును వినియోగించు కోనున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.గోపాలరావు, ఎస్ఐ సందీప్‌కుమార్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఆమదాలవలస: ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ప్రొసిడింగ్ అధికారి పి.నానిబాబు ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది, పోలీసులు చేరుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 329 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.


టెక్కలి : బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ


పోలాకి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ సురేష్ కుమార్


లావేరు : ఎన్నికల విధులకు చేరుకున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది

ఎన్‌హెచ్‌ఆర్‌సి సేవలు అభినందనీయం

డిఎస్‌పి వెంకట అప్పారావు


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

ప్రజాశక్తి- పలాస

ఎన్‌హెచ్‌ఆర్‌సి (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్) చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్వర్యంలో కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేంద్ర గిరి యాత్ర ముగించుకొని వచ్చిన యాత్రికులకు ఎండ తీవ్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన మజ్జిగ శిబిరం యాత్రికులకు ఊరటనిచ్చిందని, ఇది చాలా మంచి కార్యక్రమమన్నారు. రానున్న రోజుల్లో ఎన్‌హెచ్ఇర్‌సి ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టాలన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి పలాస అధ్యక్షులు డాక్టర్ చిన్నవాడు, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షులు చింతా సంతోష్‌కుమార్ వర్మ, సభ్యులు బమ్మిడి లోకేష్, వి. వెంకటరావు, ఎం.రాజారావు, ఎం.జగన్నాయకులు, పంగ శివయ్య, కొంచాడ వెంకటేష్, వాలంటర్లు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వైశ్య సంఘం అవినీతిపై కమిటీ వేయాలి


మాట్లాడుతున్న రాజా శ్రీకాంత్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘంలో జరుగుతున్న అవినీతిపై తక్షణమే కమిటీ వేయాలని, సంఘ ఎన్నికల కోసం ప్రశ్నించేవారు నామినేషన్ వేయకుండా ఉండేందుకు లేనిపోని నిబంధనలు గవర్నర్ బాడీ చేపట్టడం సరికాదని రాష్ట్ర వైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి కొంచాడ రాజా శ్రీకాంత్ ఆరోపించారు. గురువారం అయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో అధ్యక్షుడిగా చేశానని, ఈ సారి కూడా నామినేషన్ వేయాలని భావించినా 50 ఏళ్ల వయసు నిబంధన పెట్టి తాను నామినేషన్ వేసినా తిరస్కరించేందుకు గవర్నర్ బాడీ సిద్దపడుతుందన్నారు. 50 ఏళ్ల కన్నా చిన్నవయసు వారు రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్నారని, అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా వైశ్యసంఘం కొత్త రాజ్యాంగంతో నడుస్తుందా అని ప్రశ్నించారు. తనపై కోట్ని రమేష్ దాడి చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, యాభైఏళ్ల వయసు పరిమితిపై కోర్టును ఆశ్రయించానని వీటి పేరుతో ఎన్నికల నిబంధనలు పోలీస్‌స్టేషన్, కోర్టుకు వెళ్లినవారు అనర్హులని ప్రకటించారని, ఎంతో మంది నాయకులు జైలుకు వెళ్లిన వారు కూడా ఎమ్మెల్యేలు, సిఎంలు కాలేదా అని ప్రశ్నించారు. తన హయాంలో కరోనా సమయంలో రూ.8 లక్షలు సంఘ అదాయం బ్యాంక్‌లో డిపాజిట్ చేశానని, నేడు ఎంత మేరకు సంఘ అదాయం డిపాజిట్ చేశారనేది ఎందుకు చెప్పడం లేదని, సంఘంలో జరుగుతున్న అవినీతి అందరికి తెలియాలన్నారు. వైశ్యలు 1400 మంది కుటుంబాలు ఉండగా 900 మందిని సభ్యులుగా నమోదు చేసి, పేదలకు ఎందుకు ఓటుహక్కు ఇవ్వడం లేదన్నారు. కోరంలేని సమావేశం పెట్టి తనను సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సభ్యత్వం తొలిగించే అధికారం ఎవరికీ లేదన్నారు. సంఘంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై సంఘ నాయకులందరికీ సమాధానం చెప్పాల్సి ఉందన్నారు.

పితాపురం సమన్వయకర్తగా రాజు


దాసరి రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మార్చి 14న పితాపురంలో జరగబోయే జనసేన ఆవిర్భావ దినోత్సవం పితాపురం నియోజకవర్గం వేదికగా జరుగుతున్న ఏర్పాట్లులో ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుని సమన్వయ కమిటీలో నియమించడం సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జనసేన అధినేత పవణ్ కళ్యాణ్ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రేమతో సమన్వయ కమిటీలో స్థానం కల్పించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పని చేస్తానన్నారు.


ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న బాలకృష్ణ

రాష్ట్ర పశు వైద్యాధికారుల సంఘ ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం ఉపాధ్యక్షులుగా పొందూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. పి.ఎస్.జి.బాలకృష్ణ ఎన్నికయ్యారు. విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయ ఆవరణంలో జరిగిన ఎన్నికల్లో బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని పశు వైద్యశాఖకు చెందిన ఎడిలు, డిడిలు ఎన్నికల్లో పాల్గొన్నారు. బాలకృష్ణ ఎన్నిక కావడంపై శ్రీకాకుళం జిల్లా వెటర్నరీ జెడి కె.రాజగోపాల్, జిల్లా పశు వైద్యాధికారుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.

రబీకి అందని సాగునీరు

- ఆందోళనలో రైతులు
- ఎండిన చెరువులు
- పట్టించుకోని అధికారులు


నేలబావి నుంచి ఇంజిన్‌తో నీరు తోడుతున్న రైతులు

ప్రజాశక్తి- బూర్జ

వ్యవసాయం సాగుచేస్తున్న రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో నష్టాలు చవిచూసిన రైతులు రబీలోనైనా కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్‌కు సంబంధించి రబీలో పెసర, మినప, నువ్వులు, మొక్కజొన్న వంటి అపరాల పంటల వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈ పంటలు పండించడానికి పుష్కలంగా సాగునీరు అవసరం. మండలంలోని కొల్లివలస, తోటవాడ, అన్నంపేట, పెద్దపేట, మామిడివలస తదితర గ్రామాల్లో అపరాల పంటలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రతిఏటా సాగునీరు కోసం అవస్థలు తప్పడం లేదని రైతులు వాపోతు న్నారు. ఇప్పటికే మండలంలోని పలు చెరువులు పూర్తిగా ఎండి పోయా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగవళి నదీతీర ప్రాంతాల్లో నది నుంచి నీళ్లు వస్తాయని ఎంతో ఆశతో ఉన్నామని, ప్రస్తుతం నాగావళి నదిలో నీరు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిన కాలువలు

రైతులు తమ పంటల పండించేందుకు కాలువ నీరుపై ఆధారపడ్డారు. ముఖ్యంగా నారాయణపురం ఎడమ కాలువ, తోటపల్లి ఎడమ కాలువ, గజిలి గడ్డ కాలువలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు పుష్కలంగా సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇలా అయితే తాము పంటలను ఎలా పండించాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఆయిల్ ఇంజన్లు పెట్టుకొని నీరు తోడుకుని పంటలు పండించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇంజన్‌తో ఎకరా భూమి తడిపేందుకు గంటకు రూ.200 చొప్పున 16 గంటలకు రూ.3,200 ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సిబిసిఎన్‌సి ఆస్తులను పరిరక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న జాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అన్యాక్రాంతమవుతున్న ది కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చస్ ఆఫ్ ది నార్తన్ సర్కాస్ ఆస్తులు పరిరక్షించి, బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజయనగరం సిబిసిఎన్‌సి ట్రస్టు చైర్మన్ ఆర్.ఎస్.జాన్ కోరారు. నగరంలోని తెలుగుబాప్టిస్ చర్చిలో బుధవారం సిబిసిఎన్‌సి ట్రస్టు ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సిబిఎం మిషన్ సోంపేట నుంచి అవనిగెడ్డ వరకు అనేక బాప్టిస్టు సంఘాల పేర ఆస్తులను సంపాదించి ఉన్నారన్నారు. ఈ ఆస్తులను 1975లో మద్రాస్ హైకోర్టు తీర్పు ద్వారా ట్రస్టుకు బదలాయించారని, 1979లో సిబిసిఎన్‌సి వివాదాలు ఏర్పడి అనేక సంఘాలుగా విడిపోయాయన్నారు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు బాప్టిస్టేతరులు వారికి అనుకూలంగా వినియోగించుకుంటూ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నాయన్నారు. రత్నాకర్, యాకబ్‌లు ఆస్తులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. వారిపై తక్షణమే సిఐడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. భీమిలి బాప్టిస్టు చర్చి ఎదురుగా ఉన్న స్థలాన్ని, విజయనగరంలో సిబిఎం యుపి స్కూల్, బొబ్బిలి సిబిఎం బాలిక హైస్కూల్‌లను రత్నకుమార్ అన్యాక్రాంతానికి పాల్పడ్డారని ఆరోపించారు.

అందువల్లే ఆయనను కరస్పాండెంట్ పదవి నుంచి తొలగించామని చెప్పారు. అదే విధంగా నౌపడ, కోటబొమ్మాళి స్కూల్స్ స్థలాలను యాకబ్ కబ్జా చేసేందుకు చూస్తున్నట్టు ఆరోపించారు. సంస్థ కన్వీనర్ బాధ్యతల నుంచి యాకబ్‌ను తొలగించామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారిపై చర్యలు తీసుకొని సిబిసిఎన్‌సి ఆస్తులను పరిరక్షించాలని కోరారు.

పిసిఎంఎలో ఎన్నికల హడావుడి

ప్రజాశక్తి- పలాస

పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ (పిసిఎంఎ)లో ఎన్నికల వేడి నెలకొంది. ప్రస్తుతం ఉన్న కార్యవర్గానికి 2025 ఫిబ్రవరితో పదవి కాలం ముగిసింది. దీంతో రెండు సంత్సరాలకు నూతన కార్యవర్గం కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి రోజు మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఎలక్షన్ కమిటీ ప్రతినిధులు బెళ్లాల నారాయణరావు, మల్లా భాస్కరరావు, తర్లాన రమేష్ కుమార్ తెలిపారు. అధ్యక్ష స్థానానికి మల్లా శ్రీనివాసరావు ఒక దరఖాస్తు చేసుకోగా, కార్యదర్శి స్థానానికి టంకాల రవిశంకర్ గుప్తా, చందూరు మహేశ్వరరావులు, కోశాధికారిగా సింధిరి సతీష్‌కుమార్‌లు దరఖాస్తు చేసుకున్నారని ఎన్నికల కమిటీ ప్రతినిధులు తెలిపారు. నామినేషన్లు వేసేందుకు మరో రోజు మిగిలి ఉందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలం మాణిక్యపురం 11 కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాణిక్యపురం పంచాయతీ పరిధిలో గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


మరమ్మతులకు గురైన బోరు

బోరు బాగు చేయరూ...

లావేరు: మండలంలోని కొత్తకోట పంచాయతీ బట్టుపాళెంలోని అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురై రెండేళ్లు పైబడుతుంది. ప్రభుత్వాలు మారినా బోరు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. ఇక్కడ డైరెక్ట్ పంపింగ్ ద్వారా కొళాయిలకు తాగునీరు సరఫరా అవుతుంది. విద్యుత్ సరఫరా లేనప్పుడు వారం రోజుల పాటు గ్రామంలో తాగు, వాడుకనీరు లేక గ్రామస్తులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విద్యుత్ ప్యానల్ బోర్డు కాలిపోవడంతో వారంరోజుల పాటు నీరులేక బోరు పనిచేయక మహిళలు వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి నీరు తీసుకువచ్చేవారు. గ్రామంలో రెండు బోర్లు మరమ్మతులకు గురవ్వడంతో నీరులేక ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో మరమ్మతులకు గురైన బోరును మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ దీక్షలు?



దీక్షలో పాల్గొన్న జల్లుపుట్టుగ యువత

ప్రజాశక్తి- కవిటి

సమస్యల పరిష్కారానికి ఇంకెన్నాళ్లు తాము ఈ దీక్షలు చేయాలని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, తమ బిడ్డల భవిష్యత్ కోసం బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు 428వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం దీక్షలో పాల్గొన్న జల్లుపుట్టుగ యువత మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా తమ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఏడాదికిపైగా దీక్షలు చేస్తున్నా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తమ పరిస్థితి ఉందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నవజాత శిశువుకు అత్యాధునిక వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువుకు అత్యాధునిక వైద్యం అందించి సాధారణ స్థితికి తీసుకొచ్చామని ఆర్.కె.మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బాడాన రామ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆర్.కె.ఆస్పత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన వివాహిత రోజా అతి తక్కువ బరువు 758 గ్రాముల శిశువుకు జన్మనిచ్చిందని, సకాలంలో ప్రసవించిన ఆమె గర్భంలో ఉండగా బిడ్డ బరువు పెరడంలో సమస్య తలెత్తింది. దీంతో ఆస్పత్రిలో చేరడంతో ఆమె ప్రసవించిన తర్వాత నవజాత శిశువు ప్రాణాన్ని రక్షించడం, సుమారు నెలరోజుల పాటు ఆర్.కె ఆస్పత్రి వైద్యులు శ్రమించారని, అత్యాధునిక వైద్య సేవలు అందించడం వల్ల శిశువు ఆరోగ్యంగా పెరిగిందన్నారు. వైద్యసేవలు అందించడంలో నిరంతరం శ్రమించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ పద్మావతి, డా. సుందర్, నర్సింగ్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఆర్.కె ఆస్పత్రి చైర్మన్ వెంకటరమణ, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సూర్యనారాయణ దంపతులు

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దా

ప్రజాశక్తి- బూర్జ

తన వద్ద చదువుకున్న విద్యార్థులను, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయిలో ఉండడం పూర్తిస్థాయిలో సంతృప్తి నిచ్చిందని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీపాన సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆమదాలవలస మండలం కుమ్మరి పేటలో తల్లిదండ్రులు లేటు రాములు, లక్ష్మి నరసమ్మలకు ఆరవ సంతానంగా 1963 మార్చి 1న ఆయన జన్మించారు.

విద్యాభ్యాసం

కుమ్మరిపేటలో 1968లో ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు, 6,7 తరగతులు కనుగులవలస యుపి స్కూల్‌లో చదివారు. 8 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆమదాలవలసలో చదివారు. బిఎ, ఎంఎ విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఏలూరులో టిటిసి, ఆంధ్ర యూనివర్సిటీలో బిఇడి పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం

1984లో ఆమదాలవలస సమితి చింతల బడవంజ (ప్రస్తుతం ఎల్ఎన్‌పేట మండలం) పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అనంతరం పాత పట్నం, సంతబొమ్మాళి పాఠశాలలతో పాటు బూర్జ మండలం ఉప్పినివలస పంచాయతీలోనే 19 ఏళ్లు పని చేశారు. 2023 ఆగస్టు నెల నుంచి శ్రీకాకుళం జిల్లా ఎస్.ఎం.పురం రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి ఆగస్టు నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు.

సంతృప్తిపరిచే అంశం

తన వద్ద చదివిన విద్యార్థులు గ్రూప్‌వన్, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లుగా వివిధ శాఖల్లో పనిచేస్తున్నారు. 42 ఏళ్ల సర్వీసులో ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడం నా ఉద్యోగ జీవితంలో మిక్కిలి సంతృప్తి నిచ్చిందని సూర్యనారాయణ అన్నారు.

కుటుంబ నేపథ్యం

భార్య దమయంతి వైద్య ఆరోగ్యశాఖలో పిహెచ్‌ఎన్‌గా సరుబుజ్జిలిలో పని చేస్తూ పదవీ విరమణ పొందారు. కుమారుడు సునీంద్రబాబు, కోడలు శ్రావణి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. కుమార్తెలు, అల్లుళ్ల సునీత, తేజేశ్వరరావు, స్వాతి, రాజారావు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు.

శేష జీవితం

విద్యార్థులతో మమేకమై పనిచేయడం వలన కుటుంబాన్ని సక్రంగా చూడలేక పోయాను. ఇప్పటికీ ఆ బాధ వెంటాడుతునే ఉంది. సొంత ఇళ్లు కూడా నిర్మించు కోలేకపోయాను. పిల్లలకు సంబంధాలు చూడలేకపోయాను. నా శేష జీవితం నా కుటుంబం బాగుకోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ఏపి రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది ఎవరైనా తన సూచనలు, సలహాలు కోరితే ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాను.

దీపమే.. శాపమైంది

కొండవూరులో అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం


కన్నీరు మున్నీరవుతున్న బాధితులు (ఇన్‌సెట్‌లో కాలిపోయిన నోట్లు)

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని కొండవూరులో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. మహా శివరాత్రి పర్వదినాన ఇంట్లో దేవునికి దీపం వెలిగించి శివాలయానికి వెళ్లి వచ్చేలోగా గ్రామానికి చెందిన అడ్డి రమణ ఇంట్లో సర్వం బూడిదైంది. అప్పు తీర్చేందుకు తెచ్చిన రూ. 1.15 లక్షలు నగదు కాలిపోపోగా, మూడు తులాల బంగారం, వెండి అగ్నికి ముద్దైంది. విలువైన పత్రాలు, ఎల్ఐసి బాండ్లు, చీరలు, ఇతర కట్టుబట్టలు కాలిపోయాయి. బాధితుడు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండవూరుకు చెంది అడ్డి రమణ నిరుపేద. భూములు కౌలుకు చేసుకుని భార్య, ఇద్దరు పిల్లలతో గ్రామంలో రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం శివరాత్రి కావడంతో గ్రామానికి దగ్గరలో ఉన్న కంబాల రాయుడుపేటలోని శివాలయానికి భార్య విమలతో కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆలయానికి వెళ్లే ముందు ఇంటిలో దైవానికి దీపం వెలగించి వెళ్లారు. అయితే రమణ ఇంట్లో పొగలు రావడం చూసి స్థానికులు రమణకు సమాచారం అందించారు. దీంతో రమణ ఇంటికి చేరుకుని లోపలికి వెళ్లి చూడగా సర్వం బూడిదై ఉండటాన్ని గమనించి రమణ, భార్య విమల బోరున విలపించారు. బాధితుడు గ్రామంలో ఓ వ్యక్తికి రూ.లక్ష అప్పు ఉండడంతో ఇటీవల పెంచిన గేదెలు అమ్మగా వచ్చిన రూ.1.15 లక్షలను ఇంటిలోని దేవుడు మూల దాచిపెట్టాడు. రెండురోజుల్లో అప్పు తీర్చుదామనుకోగా ఈ సంఘటన జరగడడంతో అప్పు ఎలా తీర్చాలోనని ఆవేదన వ్యక్తం చేశాడు. నగదు పాక్షికంగా కొంత, పూర్తిగా కొంత కాలిపోయిందని, పాక్షికంగా కాలిపోయిన నగదును బ్యాంక్ అధికారులు గమనించి చెల్లుబాటు అయ్యేలా చూసి బాధితుడిని ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కొల్లి భాస్కరరావు, గ్రామపెద్దలు కోరుతున్నారు. విషయాన్ని విఆర్‌ఒ, తహశీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. బాధితునికి అవకాశం ఉన్న మేరకు సహాయం చేసి ఆదుకోవాలని వారు కోరారు.